## క్లుప్తంగా

### నాలుగు డ్రోన్ కెమెరాలు అందజేత



డ్రోన్ కెమెరాలు ఎస్పీకి అందజేస్తున్న అల్ట్రాటెక్ కంపెనీ ప్రతినిధులు

బొమ్మలసత్రం: సామాజిక సేవలో భాగంగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సుమారు రూ.7 లక్షల విలువ చేసే 4 డ్రోన్ కెమెరాలను అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ యాజమాన్యం జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణాకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, రద్దీగా ఉండే జంక్షన్లు పర్యవేక్షణకు డ్రోన్ కెమెరాలు సహాయ పడతాయన్నారు. కార్యక్రమంలో అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ ప్రతినిధులు అంజన్ ప్రకాష్, వంశీకృష్ణ, ఆర్‌జీఎం కళాశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

### హోదా మార్పుపై హర్షం

గోస్పాడు: హెల్త్ ఎడ్యుకేటర్ పోస్టును డిప్యూటీ హెల్త్ ఆఫీసర్‌గా మార్పు చేయడంపై ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1998న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైద్య ఆరోగ్య శాఖలో హెల్త్ అసిస్టెంట్‌గా పని చేస్తూ ఇన్ సర్వీస్ కోటాలో జోనల్ స్థాయిలో హెల్త్ ఎడ్యుకేటర్ పోస్టులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ హోదాలో పేరు మార్పు కోసం సుదీర్ఘ పోరాటానికి సర్కారు స్పందించిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ల సంఘం నాయకులు సుధాకర్‌రావు, హరిప్రసాద్, జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

### పోటాపోటీగా వేలం పాటలు



వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

శిరివెళ్ల: గుండంపాడు శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ మాన్యం భూమి కౌలు బహిరంగ వేలం పాటలు బుధవారం పోటా పోటీగా జరిగాయి. 2025–26, 26–27 రెండు సంవత్సరాలకు ఆలయానికున్న 63.61 ఎకరాల మాన్యం భూమి కౌలు బహిరంగ వేలం పాట ద్వారా రూ. 2.46 లక్షల అదనపు ఆదాయం సమకూరింది. గతేడాది వేలం పాటలలో రూ. 9.22 లక్షలు ఆదాయం రాగా ఈ ఏడాడి రూ. 11.25 లక్షలు ఆదాయం వచ్చింది. ఎండో మెంట్ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి పర్యవేక్షణలో పాటలు జరగగా ఈఓ రామాంజనేయ శర్మ, చైర్మన్ గంగవరపు శివరామిరెడ్డి పాల్గొన్నారు.

### మత సామరస్యం పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ యుగంధర్

ఆళ్లగడ్డ: మత సామరస్యం పాటిస్తూ బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆళ్లగడ్డ పట్టణ సీఐ యుగంధర్ అన్నారు. బక్రీద్ పండగ నేపథ్యంలో బుధవారం అన్ని వర్గాల పెద్దలతో స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం ఏర్పడకుండా సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. పోలీస్ సిబ్బందికి సహకరించాలని కోరారు. అన్ని మతాల వారు పరస్పరం సోదరభావంతో సహకరించుకుంటూ పండుగలను నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ జయప్ప, పీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


### మహానందిలో తగ్గిన రద్దీ



నిర్మానుష్యంగా ఆలయ ప్రాంగణం

మహానంది: భక్తులతో కిటకిటలాడిన మహానంది ఆలయ ప్రాంగణాలు బుధవారం వెలవెలబోతూ కనిపించాయి. వర్షాల సూచనలతో పాటు పలు చోట్ల వర్షాలు కురుస్తుండటంతో భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గింది. సాయంత్రం ఆలయ పరిసరాల్లోని ఆకాశంలో మేఘాలు మబ్బులు కమ్మి కనిపించాయి.

### అలరించిన హరికథాగానం




శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై కడపకు చెందిన యడవల్లి శ్రీనివాస్ భాగవతార్ వారిచే శివపార్వతుల కల్యాణంపై హరికథాగానం నిర్వహించారు. తబల ఎం.పవన్‌కుమార్, హార్మోని యం సహకారాన్ని వై.శ్రీనివాసరావు అందించారు.



శిరివెళ్లలో బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న నేతలు



ఉయ్యాలవాడ నుంచి ఆళ్లగడ్డకు బైక్ ర్యాలీ




నంద్యాల.. నిరసన ర్యాలీలో జిల్లా వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ నాయకులు




కలెక్టరేట్ వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు

# బాబు వెన్నుపోటుపై కన్నెర్ర

- ఆందోళన కార్యక్రమానికి కదం తొక్కిన జనం
- వేలాదిగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- ఎన్నికల హామీలు అమలు చేయాల్సిందే
- ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి డిమాండ్




ఆళ్లగడ్డలో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బిజేంద్రనాథ్‌రెడ్డి, నాయకులు



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో 'వెన్నుపోటు దినం' నిరసన కార్యక్రమం కొనసాగింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు బుధవారం చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతం అయింది. పార్టీ శ్రేణులు, రాజకీయ పరిశీలకులు, పోలీస్ ఇంటెలిజెన్స్ ఊహించని విధంగా నిరుద్యోగ యువతీ, యువకులు, రైతులు, మహిళలు, వలంటీర్లు భారీగా తరలివచ్చి కూటమి ప్రభుత్వ మోసపూరిత హామీలపై గట్టిగ నినదించారు. ఉదయం 9 గంటలకే మండలాల నుంచి వాహనాల్లో వేలాదిగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు ర్యాలీగా నియోజకవర్గ కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డితో కలిసి వారంతా నాలుగు రోడ్ల కూడలి చేరుకుని అక్కడ దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కడప– నంద్యాల రోడ్డు రహదారిని ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. తర్వాత అక్కడి నుంచి ర్యాలీగా కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ రత్నకుమారికి వినతి పత్రం అందజేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి, పార్టీ నాయకులు మీడియా సమావేశం నిర్వహించి కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు చేసిన మోసాలను ఎండగట్టారు.

**భయపెడితే పారి పోయే సంస్కృతి కాదు**

ఎన్నికల ముందు ఏదో విధంగా గద్దెనెక్కేందుకు చంద్రబాబు, కూటమి నేతలు అబద్ధపు హామీలు ఇచ్చారని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. ఏడాదైనా ఎన్నికల హామీలు అమలు చేయకపోగా ప్రశ్నించే నాయకులపై రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు. అయితే, వారి బెదిరింపులకు భయపడి పారిపోయే సంస్కృతి తమది కాదని గంగుల బిజేంద్రారెడ్డి హెచ్చరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తమకు తెలుసని, సంపద సృష్టించి ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని నాడు చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ గొప్పలు చెప్పారని, ఇప్పుడు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. నమ్మి ఓటేసిన ప్రజలను మోసం చేయడం ఆది నుంచి చంద్రబాబుకు అలవాటు అని మండిపడ్డారు. మోసకారి బాబును త్వరలో ప్రజలే చొక్కా పట్టుకుని నిలదీస్తారని హెచ్చరించారు. రైతులు, విద్యార్థులు, యువకులు, మహిళలు ఇలా అన్ని వర్గాల ప్రజలను సూపర్ సిక్స్ పేరుతో వంచించారన్నారు. ప్రభుత్వ బాధ్యతా రాహిత్యాన్ని ఎత్తిచూపితే కేసులు పెట్టి వేధించడం సిగ్గుచేటన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ప్రకటించి గత ఏడాది చివరిన ఒక్క సిలిండర్ మాత్రమే ఇచ్చారని అందులో కూడా చాలమంది ఖాతాల్లో నగదు జమ చేయలేదన్నారు. చదువుకునే వారు ఇంట్లో ఎంతమంది ఉంటే అందరికీ తల్లికి వందనం కింద రూ. 15 వేల చొప్పున ఇస్తామన్నారు. మహిళలకు ప్రతి ఒక్కరికీ నెలకు రూ 1500 చొప్పున 'ఆడబిడ్డ నిధి' ఇస్తామన్నారు. ఇంటింటికి ఉద్యోగంలో భాగంగా 20 లక్షల ఉద్యోగాలు ఉద్యోగం వచ్చే వరకు ప్రతి ఒక్కరికి నెలకు రూ 3 వేలు భృతి ఇస్తామన్నారు. ఉచిత బస్సు ప్రయాణం వంటి ఎన్నో హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ అమలు చేయకపోవడం ప్రజలను వెన్నుపోటు పొడవటం కాదా అని ప్రశ్నించారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన దేవుడెరుగు వలంటీర్లు, రేషన్ వాహనాల ఆపరేటర్లు, సహాయకుల ఉద్యోగాలను ఊడగొట్టి రోడ్డున పడేశారని మండిపడ్డారు. సంపద సృష్టిస్తానన్న చంద్రబాబు తమ ఎమ్మెల్యేలకు సంపద సృష్టించుకునే భాగంలో రోడ్డుపై నడుస్తున్న బస్సుల నుంచి దిబ్బలపై మేస్తున్న కోళ్లకు సైతం కప్పం కట్టాల్సి రావడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు భూమా కిశోర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకుడు బాబులాల్ ఎంపీపీలు గజ్జల రాఘవేంద్రారెడ్డి, వసీం, వీరభద్రుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు కొట్టె నాగాశ్వర్‌రావు, ప్రసాద్‌రెడ్డి, ఇందూరు ప్రతాప్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు

### మండలాల నుంచి తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఉయ్యాలవాడ : ఆళ్లగడ్డ పట్టణంలో నిర్వహించిన వెన్నుపోటు దినం ర్యాలీ, నిరసన కార్యక్రమానికి ఉయ్యాలవాడ మండలం నుంచి భారీ ఎత్తున వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివెళ్లారు. పార్టీ మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, మాజీ ఎంపీ సోదరుడు పోచా రాధాక్రిష్ణారెడ్డి, నాయకులు కప్పరం శ్రీనివాసరెడ్డి, సాయిరెడ్డి, పల్లె మహేశ్వర రెడ్డి, కసాని ప్రతాప్‌రెడ్డి, కసాని రవీంద్రారెడ్డి, తరిగోపుల ప్రసాద్‌రెడ్డి, ఎర్రి శ్రీనివాసరెడ్డి, పల్లె మద్దిలేటి రెడ్డిల ఆధ్వర్యంలో 20 గ్రామ పంచాయతీల నుంచి నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీతో వెళ్లారు.

శిరివెళ్ల: ఆళ్లగడ్డలో వైఎస్సార్‌సీపీ చేపట్టిన కార్యక్రమానికి శిరివెళ్ల మండలం నుంచి సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలి వెళ్లారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బి. అబ్దుల్ సలాం, ఎంపీపీ నాయక్ వసీం, జెడ్పీటీసీ వైస్ చైర్మన్ దిల్షాద్ బేగం తదితరులు జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు.

రుద్రవరం: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై నిరసన తెలిపేందుకు ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పిలుపు మేరకు రుద్రవరం మండలంలోని 21 గ్రామ పంచాయతీల నుంచి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మోటర్ సైకిళ్లకు వైఎస్సార్‌సీపీ జెండాలు కట్టుకొని ర్యాలీగా బయలుదేరారు.




నిరసన ర్యాలీలో ఎమ్మెల్సీలు కల్పలతారెడ్డి, ఇసాక్‌బాషా, మాజీ ఎంపీ పోచా, నాయకులు

# మాట తప్పిన సర్కారు

- కూటమి ప్రభుత్వ పాలనపై వైఎస్సార్‌సీపీ నాయకుల ధ్వజం
- హామీలు అమలుచేయకుండా ప్రజలను మోసం చేశారని మండిపాటు
- వెన్నుపోటు దినంపై నిరసన కార్యక్రమం విజయవంతం
- భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, ప్రజలు
- కూటి సర్కారు గుణపాఠం తప్పదని ఎమ్మెల్సీలు కల్పలతా రెడ్డి, ఇసాక్‌బాషా హెచ్చరిక

బొమ్మల సత్రం: కూటమి సర్కారు ఏడాది పాలనపై నిరసన పెల్లుబికింది. చంద్రబాబు నమ్మకద్రోహం చేశారని వివిధ వర్గాల ప్రజలు రోడ్డెక్కారు. బుధవారం నంద్యాలలో వైఎస్సార్‌సీపీ చేపట్టిన వెన్నుపోటు దినం ఆందోళన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని మాట తప్పిన సర్కారు అంటూ నినాదాలు చేశారు. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి పిలుపు మేరకు స్థానిక ఉదయానంద రెసిడెన్సీ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు సాగిన ఈ నిరసన ర్యాలీకి వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పార్టీ పార్లమెంట్ పరిశీలకురాలు ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి , ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బాబున్నిసా , రాష్ట్ర మాజీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత కల్లూరి రామలింగారెడ్డి, లీగల్‌సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ విజయశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామసుబ్బయ్య, పార్టీ ఉపాధ్యక్షుడు దాల్‌మిల్ అమీర్, ప్రధాన కార్యదర్శి సోమశేఖర్‌రెడ్డి, జిల్లా అధికారప్రతినిధి అనిల్ అమృతరాజ్ హాజరయ్యారు. ఆందోళన కార్యక్రమానికి పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించినా ప్రజలు స్వచ్ఛందగా తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**సూపర్ సిక్స్ పథకాలు ఎక్కడ?**

ఆందోళన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకురాలు , ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదైనా సూపర్ సిక్స్ పథకాలకు అతీగతీ లేదని మండిపడ్డారు. ఎన్నికల హామీలకు మోక్షం ఎప్పుడు చంద్రబాబు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన ప్రజలకు వెన్నుపోటు పొడిచి అధికారం చేపట్టారని ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్ అంటే మహిళలు, రైతులు, విద్యార్థులు, వ్యాపారులు, నిరుద్యోగులు, ఉద్యోగస్తులను మోసం చేయడమేనా అని ప్రశ్నించారు. ప్రజలకు తాము అండగా ఉంటామని, వారికి ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు బాబు సర్కారును వదలమన్నారు. ఇందులో భాగంగానే వెన్నుపోటు దినం నిసరన కార్యక్రమం చేపట్టామన్నారు. వెంటనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రజా సంక్షేమం దేవుడెరుగు రాష్ట్రంలో ఎక్కడ చూసినా మద్యం ఏరులై పారుతుందని చెప్పారు.

**వెన్నుపోటు బాబు నైజం**

వెన్నుపోటు పొడవడం చంద్రబాబు నైజమని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా ధ్వజమెత్తారు. బిడ్డను ఇచ్చిన మామనే మోసం చేసిన ఘనత బాబుది అన్నారు. ఆయన పాలన అంతా కుట్రలు, కుయుక్తులతో సాగుతుందని మండిపడ్డారు. ఎమ్మెల్యేలను , ఎమ్మెల్సీలను కొనుగోలు చేసి రాజకీయాల్లో ఎదిగారన్నారు. చంద్రబాబు రాజకీయ జీవితంలో నీతి నిజాయితీగా గెలిచిన దాఖలాలు లేవన్నారు. స్వార్థ రాజకీయాలు చేయడం తప్ప ప్రజలకు మేలు చేసే రకం కాదన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌లాగే బాబు మాట మీద నిలబడే వ్యక్తి కాదన్నారు. ఇందుకు ఆయన ఏడాది పాలననే నిదర్శనమన్నారు. అంతకు ముందు కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై జేసీ విష్ణుచరణ్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, జిల్లా సెక్రటరీలు బాషా, శివనాగిరెడ్డి, నాయకులు రమణ, టీవై శివయ్య, తిరుపతి, కారు రవికుమార్, రసూల్ ఆజాద్, సుబ్బారెడ్డి , ఎంపీపీలు శెట్టిప్రభాకర్, ఆర్డర్ సైమస్, డాక్టర్ శశికళారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాసులు, బసవేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



ప్రకృతి వ్యవసాయం గురించి వివరిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి గ్రామ రైతు పీఎండీఎస్ పంటను అవలంభించి ఏగ్రేడ్, ఏటీఎం మోడల్స్ అమలు చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయ మోడల్స్‌పై రైతులకు సమగ్ర అవగాహన కల్పించాలన్నారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు మాట్లాడుతూ ఉద్యాన పంటల్లోనూ పీఎండీఎస్ పద్ధతులు అమలు చేయడం ద్వారా రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మరింత ఆకర్షించవచ్చన్నారు. డీడీఏ చెన్నయ్య మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యత గురించి వివరించారు. రైతు సాధికారిత సంస్థ, ప్రకృతి వ్యవసాయ విస్తరణ కోసం అనుబంధ సంఘాలన్నీ పని చేయాలన్నారు. జిల్లాలోని అన్ని రైతు సేవా కేంద్రాల సిబ్బందికి జూన్ 12, 13, 14, 19, 20, 21 తేదీల్లో రెండు విడతలుగా డివిజన్ స్థాయి శిక్షణలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో ఈవీసీ విజయ్‌కుమార్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్, ఉద్యాన శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు, శ్రీనివాసులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. సమావేశంలో ప్రాజెక్టు మేనేజర్ నరేంద్రారెడ్డి, అడిషనల్ ప్రాజెక్టు మేనేజర్ అబ్దుల్‌సలాం, రాజేశ్వర్, సరళమ్మ, తదితరులు పాల్గొన్నారు.

### విషరహిత ఆహారం అందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

నంద్యాల(న్యూటౌన్): విషరహిత ఆహారాన్ని అందించడమే ప్రకృతి వ్యవసాయం లక్ష్యమని డీడీఓ మురళీకృష్ణ, డాక్టర్ రామకృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో గోస్పాడు మిల్లెట్స్ ఫెడ్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో బుధవారం ప్రకృతి వ్యవసాయం, దేశవాళీ విత్తన మేళా కార్యక్రమం నిర్వహించారు. సుభాష్ పాలేకర్ ఆదర్శంగా తీసుకొని తెలుగు రాష్ట్రాల్లో ఎస్‌పీకే వ్యవసాయం చేస్తున్న రైతులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. డీడీఏ మాట్లాడుతూ పంట సాగులో రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకం తగ్గించాలని సూచించారు. దేశీయ విత్తనాలు మట్టి ఆరోగ్యాన్ని, మనిషి ఆరోగ్యాన్ని కాపాడుతాయన్నారు.

## పారదర్శకంగా రేషన్ పంపిణీ చేయాలి



చౌక దుకాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

శిరివెళ్ల: నిత్యవసర వస్తువులను పారదర్శకంగా పంపిణీ చేయాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. బుధవారం ఆమె మండల కేంద్రంలో ఆకస్మిక తనిఖీలతో హడలెత్తించారు.ముందుగా ప్రభుత్వ వైద్య శాలను సందర్శించి మందుల స్టాక్, వైద్యసేవలు, సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించారు. రక్త పరీక్షలు, మందుల విభాగం, జనరల్ వార్డులు పరిశీలించారు. నెల కు వైద్య శాలలో ఎన్ని కాన్పులు జరుగుతున్నాయని డాక్టర్ ముఖేష్ కుమార్‌ను ఆరా తీశారు. వైద్యశాలకు రోడ్డు, ఆవరణలో సిమెంట్ రోడ్డు వేసేందుకు అవసరమయిన నిధులు మంజూరు చేస్తానని కలెక్టర్ చెప్పా రు. ప్రతి 3వ శనివారం జరిగే స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొనాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం చౌక దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాల్లో ఉన్న స్టాక్, పంపిణీ వివరాల రిజిష్టర్లను పరిశీలించారు. ఎంత సరుకు వచ్చింది, ఎంత మందికి పంపిణీ చేశారని డీలర్లను అడిగి తెలుసుకున్నారు. అందరికి కనపడేలా రేషన్ దుకాణాల బోర్డుల ఏర్పాటు చేయాలని, పంపిణీ వేళలను అందులో ఉంచాలన్నా రు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వర కు, తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు తప్పని సరిగా దుకాణాలను తెరిచి ఉంచాల న్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తని ఖీ చేశారు. వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చే అర్జీలను పరిశీలించి గడువు లోగా పరిష్కరించాలని తహసీల్దార్ పుష్పకుమారిని ఆదేశించారు. గ్యాస్ ఏజెన్సీలు, చౌక దుకాణాలను తనిఖీలు చేస్తుండాలన్నారు. అనంతరం శిరివెళ్ల మెట్ట వద్ద ఉన్న గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. గ్యాస్ డెలివరీ బాయ్స్ అధికంగా డబ్బులు వసూళ్లు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రామోహన్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**అర్హులకు కౌలు కార్డు**

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో అర్హులైన కౌలు రైతులకు సీసీఆర్‌సీలు పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ అంశాలపై తహసీల్దార్లు, ఆర్‌డీఓలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. లో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్‌ఓ రాము నాయక్, కలెక్టరేట్ ఏఓ రవికుమార్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు ఎరువులు, ముందులు, విత్తనాలు తదితర విషయంలో ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

## శ్రీశైల దేవస్థానంలో అంతర్గత బదిలీలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో పలువురు రెగ్యులర్, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేస్తూ శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 95 మందిని ఏక కాలంలో అంతర్గత బదిలీలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఏఈఓలు – ఐదుగురు, సూపరింటెండెంట్‌లు –18 మంది, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు–26, రికార్డు అసిస్టెంట్లు, అటెండర్లు– 14 మందితో పాటు 32 మంది అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ బేసిక్ సిబ్బందిని అంతర్గత బదిలీ చేస్తూ ఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. ఓవరాల్ సూపర్‌విజింగ్‌గా డిప్యూటీ కమిషనర్ ఎం.రమణమ్మ, రెవెన్యూ విభాగానికి సహాయ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారిగా ఎం.హరిదాసు, గోశాలకు జి.స్వాములు, అకౌంట్స్, పడితరం, శానిటేషన్ విభాగానికి కె.వెంకటేశ్వరరావును బదిలీ చేశారు. పరిపాలన సౌలభ్యం కోసం అంతర్గత బదిలీలు చేసినట్లు ఉత్తర్వులో ఈఓ పేర్కొన్నారు.

## ల్యాబ్ రికార్డులు సక్రమంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

గోస్పాడు: ఆరోగ్య పరీక్షలకు సంబంధించిన రికార్డులను ల్యాబ్‌లలో సక్రమంగా నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ వెంకటరమణ ఆదేశించారు. బుధవారం నంద్యాల సర్వజన ఆసుపత్రిలోని ఎంసీహెచ్ బ్లాక్‌లో జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రతి రోజు నిర్వహించే రక్త పరీక్షలను సంబంధిత పోర్టల్ నందు నమోదు తప్పని సరిగా చేయాలని, నిర్దేశించిన లక్ష్యాలను తప్పని సరిగా సాధించాలన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ శారదాబాయి, సహాయ మలేరియా అధికారి రామవిజయ్‌రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

### సాక్షి గణపతికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్ర స్వామికి విశేషపూజ లు నిర్వహించారు. సాక్షి గణపతి స్వామికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధ జలంతో అభిషేకం చేసి విశేష పుష్పా ర్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు.

### యోగాతో ఆరోగ్యం



యోగా చేస్తున్న వైద్యులు

గోస్పాడు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర సురేఖ అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో బుధవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో రెండో సంవత్సరం ఎంబీబీఎస్ విద్యను అభ్యసిస్తున్న హేమలత యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతిరోజూ యోగాను గంట పాటు చేయాలన్నారు. దీంతో ఒత్తిడి తగ్గడంతో పాటు మానసికంగా ఎంతో ఉత్సాహంగా ఉండేందుకు వీలవుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు రాజశేఖర్, కళావతి, గైనిక్ హెచ్‌ఓడీ డాక్టర్ పద్మజ, కళాశాల ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

### మహిళ ఆత్మహత్య

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని పార్నపల్లి గ్రామంలో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కైప వరలక్ష్మి (45) పదిహేనేళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతోంది. డాక్టర్లకు చూపించినా వ్యాధి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి పబ్బతి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.